AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in
27-9-2025 (Saturday) MAIN EDITION

## టాటా గ్రూప్ నుంచి మరో ఐపీవో..

**అక్షరటుడే, బిజినెస్ డెస్క్ :** టాటా గ్రూప్‌నకు చెందిన ఎన్‌బీఎఫ్‌సీ దిగ్గజం టాటా క్యాపిటల్ పబ్లిక్ ఇష్యూకు వస్తోంది. వచ్చేనెల 6వ తేదీన సబ్‌స్క్రిప్షన్ ప్రారంభం కానుంది. రూ. 17,200 కోట్లు సమీకరించేందుకు అనుమతుల కోసం ఇప్పటికే సెబీకి దరఖాస్తు చేసుకున్న విషయం తెలిసిందే. ఇందులో ఆఫర్ ఫర్ సేల్ ద్వారా టాటా సన్స్ ప్రైవేట్ లిమిటెడ్ 23 కోట్ల షేర్లను, భాగస్వామ్య సంస్థ అయిన ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్ మరో 3.58 కోట్ల షేర్లను విక్రయించనుంది. అదనంగా ఫ్రెష్ ఇష్యూ ద్వారా కంపెనీ 21 కోట్ల షేర్లను జారీ చేయనుంది.

## టీమిండియాకు గాయాల టెన్షన్..



**అక్షరటుడే, స్పోర్ట్స్ డెస్క్:** ఆసియా కప్ 2025 టోర్నమెంట్‌లో ఇప్పటివరకు అజేయంగా దూసుకెళ్తున్న టీమిండియా ఫైనల్‌కు అర్హత సాధించింది. వరుస విజయాలతో ఆకట్టుకుంటూ వచ్చిన భారత్ ఆదివారం పాకిస్తాన్‌తో టైటిల్ పోరులో తలపడనుంది. ఈ సమయంలో యువ బ్యాటర్ అభిషేక్ శర్మ, కీలక ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా స్వల్ప గాయాలతో ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటివరకు పాక్‌తో జరిగిన రెండు మ్యాచ్‌ల్లోనూ భారత్ గెలుపొందింది. రేపటి ఫైనల్‌లో కూడా భారత్‌కే మెరుగైన విజయావకాశాలున్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## బీఎస్ఎన్ఎల్ 4జీ నెట్‌వర్క్ ప్రారంభం



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ప్రభుత్వరంగ టెలికాం సంస్థ బీఎస్ఎన్ఎల్ స్వదేశీ 4జీ సేవలు దేశవ్యాప్తంగా అందుబాటులోకి వచ్చాయి. ఒడిశా పర్యటనలో ఉన్న ప్రధాని మోదీ శనివారం జర్సుగూడలో జరిగిన కార్యక్రమంలో దేశవ్యాప్తంగా బీఎస్ఎన్ఎల్ 4జీ నెట్‌వర్క్‌ను వర్చువల్‌గా ప్రారంభించారు.

## తిరుమల కొండపై ఆంక్షలు




**అక్షరటుడే, వెబ్‌డెస్క్:** తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలు వైభవోపేతంగా కొనసాగుతున్నాయి. గరుడ సేవ దృష్ట్యా తిరుమలపై ఆంక్షలు విధించారు. శనివారం రాత్రి 9 గంటల నుంచి 29వ తేదీ ఉదయం 6 గంటల వరకు ద్విచక్ర వాహనాలను తిరుమలకు అనుమతించబోమని టీటీడీ అధికారులు తెలిపారు.

## ఏసీబీకి చిక్కిన టౌన్ ప్లానింగ్ అధికారి

**అక్షరటుడే, మేడ్చల్:** ఎల్లంపేట్ మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి రాధాకృష్ణారెడ్డి ఏసీబీకి పట్టుబడ్డారు. ఓ వెంచర్‌కు అనుమతి ఇవ్వడానికి ఆయన రూ.5 లక్షల లంచం డిమాండ్ చేశాడు. శనివారం బాధితుడి నుంచి రూ.3.50 లక్షల లంచం తీసుకుంటుండగా.. అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

## మంజీర ఉగ్రరూపం..



**అక్షరటుడే, మెదక్:** ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో మంజీరకు భారీగా వరద వస్తోంది. దీంతో సింగూరు ప్రాజెక్ట్ నుంచి దిగువకు 85 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సింగూరు నుంచి నీటి విడుదల కొనసాగుతుండడంతో మెదక్ జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం ఏడుపాయలలో మంజీర ఉధృతంగా ప్రవహిస్తోంది. ప్రతి సంవత్సరం శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అయితే ఈ ఏడాది మంజీర ఉధృతంగా పారుతుండడంతో ఆలయం మూసి ఉంది. రాజగోపురంలో వనదుర్గా భవానీకి మాత్రమే పూజలు చేస్తున్నారు.

## పార్టీ మారిన ఎమ్మెల్యేల విచారణకు షెడ్యూల్

**అక్షరటుడే, హైదరాబాద్:** రాష్ట్రంలో పార్టీ మారిన ఎమ్మెల్యేల విచారణకు స్పీకర్ గడ్డం ప్రసాద్ సిద్ధమయ్యారు. ఈ అంశంపై మూడు నెలల్లో స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు తీర్పు చెప్పడంతో ఆయన చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో స్పీకర్ కార్యాలయం శనివారం షెడ్యూల్ విడుదల చేసింది. బీఆర్ఎస్ నుంచి గెలిచిన పది మంది ఎమ్మెల్యేలు హస్తం గూటికి చేరిన విషయం తెలిసిందే. పార్టీ మారిన వారిలో ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావ్ (భద్రాచలం), కడియం శ్రీహరి (స్టేషన్ ఘన్‌పూర్), దానం నాగేందర్ (ఖైరతాబాద్), పోచారం శ్రీనివాస్‌రెడ్డి (బాన్సువాడ), బండ్ల కృష్ణమోహన్ రెడ్డి (గద్వాల), కాలే యాదయ్య (చేవేళ్ల), సంజయ్ కుమార్ (జగిత్యాల), ప్రకాశ్ గౌడ్ (రాజేంద్రనగర్), అరికపూడి గాంధీ (శేరిలింగంపల్లి), మహిపాల్‌రెడ్డి (పటాన్‌చెరు) ఉన్నారు.

## యువతకు భవిష్యత్తుకు అవకాశాలు



**అక్షరటుడే, హైదరాబాద్:** తెలంగాణలోని యువతీ యువకులు తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవడానికి ప్రభుత్వం అన్ని రకాల అవకాశాలు కల్పిస్తుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అవకాశాలను సద్వినియోగం చేసుకుని భవిష్యత్తుకు ప్రణాళికలు వేసుకోవాలని సూచించారు. మల్లేపల్లి ఐటీఐ కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 65 ఏటీసీలను వర్చువల్‌గా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నైపుణ్యం పెంచుకోవడానికి ప్రభుత్వం అన్ని అవకాశాలను కల్పిస్తోందన్నారు. వాటిని సద్వినియోగం చేసుకుని ఉజ్వల భవిష్యత్తుకు ప్రణాళికలు వేసుకోవాలన్నారు.



# ముంచెత్తిన మూసి..

- జలదిగ్బంధంలో మహా నగరం
- ఎంజీబీఎస్‌లోకి భారీ వరద
- హైదరాబాద్ వాసుల అవస్థలు

**హైదరాబాద్ మహా నగరాన్ని మూసీ నది ముంచెత్తింది. రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో కుండపోత వానలు పడడంతో వరద పోటెత్తింది. మూసీ వరద ఉధృతికి చాలా ప్రాంతాలు నీట మునిగాయి. ముఖ్యంగా ఓల్డ్ సిటీలోని పలు ప్రాంతాల్లోకి వరద నీరు చేరింది. నది పరీవాహక ప్రాంతాల్లోని ఇళ్లలోకి వరద నీరు చేరింది. భారీ వర్షాలతో హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్‌కు భారీగా వరద వస్తోంది. దీంతో అధికారులు గేట్లు ఎత్తి మూసిలోకి నీటిని విడుదల చేస్తున్నారు.**

**–అక్షరటుడే, హైదరాబాద్**

నగరంలోని ప్రధాన బస్టాండ్ ఎంజీబీఎస్‌ను మూసి నది ముంచెత్తింది. శుక్రవారం అర్ధరాత్రి ఒక్కసారిగా బస్టాండ్‌లోకి వరద నీరు వచ్చి చేరింది. దీంతో ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. అధికారులు స్పందించి వారిని తాళ్ల సాయంతో బయటకు తీసుకు వచ్చారు. ఆర్టీసీ అధికారులు ఎంజీబీఎస్ నుంచి బస్సుల రాకపోకలను నిలిపి వేశారు. జేబీఎస్, ఆరాంఘర్, ఎల్బీ నగర్, ఉప్పల్ క్రాస్ రోడ్డు నుంచి అటువైపు ఉన్న జిల్లాలకు బస్సులను నడిపిస్తున్నారు.

### ప్రమాదకరంగా ప్రవాహం

ముసారాంబాగ్ వద్ద మూసీ ప్రమాదకరంగా ప్రవహిస్తోంది. వంతెన పైనుంచి 10 అడుగుల మేర వరద పారుతోంది. ప్రస్తుతం అక్కడ నిర్మాణంలో ఉన్న బ్రిడ్జిని తాకుతూ వరద పారుతోంది. నీటి ఉధృతికి బ్రిడ్జికి సంబంధించిన నిర్మాణ సామగ్రి కొట్టుకుపోయింది. పురానాపూల్ శివాలయం ఘాట్ నీట మునిగింది. చాదర్‌ఘాట్, పురానాపూల్ ప్రాంతాల్లో ఇళ్లు నీట మునిగాయి.

మూసీ వరదలపై హైదరాబాద్ ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించారు. వర్షాలు, వరదలతో ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. అయితే మూసీ పరీవాహక ప్రాంతాల్లో నివసిస్తున్న దాదాపు వెయ్యి మందిని అధికారులు ఇప్పటికే పునరావాస కేంద్రాలకు తరలించారు.

కాగా.. హైదరాబాద్ నగరంలో భారీ వర్షాలు, మూసీ నదికి వరద పోటెత్తడంపై మాజీ మంత్రి హరీశ్‌రావు స్పందించారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే నగరంలో వరదలు వచ్చాయని ఆయన ధ్వజమెత్తారు.

## ఐఏఎస్, ఐపీఎస్‌ల బదిలీ




**అక్షరటుడే, హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం పలువురు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను ట్రాన్స్‌ఫర్ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన వారిలో ఆరుగురు ఐఏఎస్‌లు, 23 మంది ఐపీఎస్ అధికారులు ఉన్నారు. ఐఏఎస్ అధికారి సయ్యద్ అలీ ముర్తజా రిజ్వీ జీఏడీ పొలిటికల్ సెక్రెటరిగా నియమితులయ్యారు. వ్యవసాయ, సహకార శాఖ ప్రభుత్వ కార్యదర్శి రఘునందన్ రావు వాణిజ్య పన్నుల కమిషనర్‌గా ట్రాన్స్‌ఫర్ అయ్యారు. ట్రాన్స్‌పోర్టు కమిషనర్‌గా రఘునందన్‌రావు బదిలీ అయ్యారు. సురేంద్ర మోహన్ వ్యవసాయ, సహకార శాఖ కార్యదర్శిగా నియమితులయ్యారు.

### సిరిసిల్ల కలెక్టర్‌కు ఉద్వాసన

సిరిసిల్ల కలెక్టర్ సందీప్ కుమార్ ఝాను ప్రభుత్వం ఉద్వాసన పలికింది. ఆయనపై గత కొంత కాలంగా ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయి. తాజాగా సిరిసిల్ల కలెక్టర్‌గా విద్యాశాఖ ప్రత్యేక కార్యదర్శిగా కొనసాగుతున్న ఎం.హరితను నియమించింది. అలాగే కె.హరిత ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శిగా, సందీప్ కుమార్ ఝా ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శిగా బదిలీ అయ్యారు.

### హైదరాబాద్ సీపీగా సజ్జనార్

ఇంటెలిజెన్స్ చీఫ్‌గా ఉన్న శివధర్‌రెడ్డిని ప్రభుత్వం డీజీపీగా నియమించిన విషయం తెలిసిందే. దీంతో ఆ పదవికి విజయ్‌కుమార్‌ను ఎంపిక చేసింది. హైదరాబాద్ సీపీగా కొనసాగుతున్న సీవీ ఆనంద్ హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఆయన స్థానంలో ఆర్టీసీ ఎండీగా కొనసాగుతున్న వీసీ సజ్జనార్‌కు బాధ్యతలు అప్పగించింది. అలాగే విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీగా శిఖా గోయల్, ఆర్టీసీ ఎండీగా నాగిరెడ్డి, గ్రేహౌండ్స్ ఏడీజీగా అనిల్ కుమార్, పౌర సరఫరాల శాఖ కమిషనర్‌గా స్టీఫెన్ రవీంద్ర, ఫైర్ డీజీగా విక్రమ్ సింగ్ బదిలీ అయ్యారు. హైదరాబాద్ అడిషనల్ సీపీ(క్రైం )గా శ్రీనివాసులు, హైదరాబాద్ అడిషనల్ సీపీ(శాంతిభద్రతలు)గా తసఫీర్ ఇక్బాల్, వెస్ట్ జోన్ డీసీపీగా సీహెచ్ శ్రీనివాస్ నియమితులయ్యారు. నారాయణపేట్ ఎస్పీగా వినీత్, సిద్ధిపేట సీపీగా విజయ్ కుమార్, ఏసీబీ జాయింట్ డైరెక్టర్‌గా సింధు శర్మను ప్రభుత్వం నియమించింది. రాజేంద్ర నగర్ డీసీపీగా యోగేష్ గౌతమ్, ఎల్బీ నగర్ డీసీపీగా అనురాధ, మాదాపూర్ డీసీసీగా రీతిరాజ్ ట్రాన్స్‌ఫర్ అయ్యారు.

## పార్టీ కీలక బాధ్యతల నుంచి తప్పుకున్న నారాయణ



**అక్షరటుడే, హైదరాబాద్:** పార్టీ కీలక బాధ్యతల నుంచి సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ తప్పుకున్నారు. తనకు 75 ఏళ్లు నిండడంతో పార్టీ బాధ్యతల నుంచి తప్పుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు శనివారం ప్రకటించారు. పార్టీలో 75 ఏళ్లు నిండిన వారు రిలీవ్ కావాలని గతంలో నిర్ణయించారు. ఈ మేరకు తాను నాయకత్వ బాధ్యతల నుంచి తప్పుకుంటున్నట్లు తెలిపారు. ఇకపై పార్టీ కంట్రోల్ కమిషన్ ఛైర్మన్‌గా ఆయన కొనసాగున్నారు.

## మోగనున్న 'స్థానిక' నగారా



**అక్షరటుడే, హైదరాబాద్:** రాష్ట్రంలో అతి త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలకు నగారా మోగనుంది. 42 శాతం బీసీ రిజర్వేషన్ల అమలుకు ప్రభుత్వం జీవో జారీ చేయడంతో ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయడానికి ఎన్నికల సంఘం సిద్ధమైంది. ఎన్నికల డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌ను రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని శనివారం సీఎం రేవంత్‌రెడ్డికి అందజేశారు. రెండు దశల్లో ఎన్నికలు నిర్వహిస్తామని నోటిఫికేషన్‌లో పేర్కొన్నట్లు సమాచారం. సీఎం మేరకు డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌లో మార్పులు, చేర్పులు చేసి శనివారం సాయంత్రానికి తుది నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల కమిషనర్.. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు, డీజీపీ జితేందర్‌తో భేటీ అయ్యారు. రాష్ట్రంలోని ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలపై చర్చించనున్నారు. బ్యాలెట్ బాక్సులు, పోలింగ్ సిబ్బంది తదితర అంశాలను అధికారులు ఎన్నికల సంఘానికి వివరించనున్నారు. అనంతరం ఎన్నికల సంఘం స్థానిక ఎన్నికల నిర్వహణపై నిర్ణయం తీసుకోనుంది. జెడ్పీలు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీ స్థానాల వారీగా ప్రభుత్వం రిజర్వేషన్లను ఖరారు చేసింది. మొదట ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించి తర్వాత సర్పంచ్ ఎన్నికలు జరిపే యోచనలో ఉన్నట్లు సమాచారం.

## ప్రజలకు బాకీ పడ్డ రేవంత్ ప్రభుత్వం: కేటీఆర్



**అక్షరటుడే, హైదరాబాద్:** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఎన్నో హామీలు ఇచ్చి.. అధికారంలోకి రాగానే మరిచిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు బాకీ పడిందని వ్యాఖ్యానించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంపై తెలంగాణ భవన్‌లో శనివారం మాజీ మంత్రి హరీశ్‌రావుతో కలిసి కేటీఆర్.. బాకీ కార్డులను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రతినెలా మహిళలకు రూ.2,500 చొప్పున ఇస్తామని చెప్పిందని గుర్తు చేశారు. ఈ లెక్కన 22 నెలల పాలనలో ఒక్కో మహిళకు రూ.55 వేలు ప్రభుత్వం బాకీ పడిందన్నారు. వృద్ధులకు పెన్షన్ నెలకు రూ. 4 వేల చేస్తామన్నారని, ఆ లెక్కన ఒక్కొక్కరికి రూ.రూ.44 వేలు బాకీ పడిందని రాష్ట్ర ప్రభుత్వంపై కేటీఆర్ విమర్శలు చేశారు.

## బాలీవుడ్‌లో ఎంట్రీ ఇవ్వనున్న మీనాక్షి చౌదరి..



**తెలుగు ప్రేక్షకుల మనసులను గెలుచుకున్న ముద్దుగుమ్మ మీనాక్షి చౌదరి. ప్రస్తుతం ఈ అమ్మడు బాలీవుడ్ ఎంట్రీకి రంగం సిద్ధం చేసుకుంటోంది. టాలీవుడ్‌లో 'లక్కీ భాస్కర్', 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాలతో మంచి విజయాన్ని అందుకున్న ఈ అందాల భామ కొత్త ప్రాజెక్టులకు కమిట్ కావడం లేదు. తాజా సమాచారం ప్రకారం.. మీనాక్షి బాలీవుడ్‌లో జాన్ అబ్రహం హీరోగా నటిస్తున్న 'ఫోర్స్ 3' సినిమాకు హీరోయిన్‌గా ఎంపికైంది. బాలీవుడ్‌కు చెందిన పలువురు నటీమణులను పరిశీలించిన తర్వాత, చివరికి మేకర్స్ మీనాక్షిని సెలెక్ట్ చేసినట్లు సమాచారం. ఈ సినిమాతో మీనాక్షి హిందీ చిత్ర పరిశ్రమలో గ్రాండ్ ఎంట్రీ ఇవ్వబోతుంది.**

**- అక్షరటుడే, సినిమాడెస్క్**